భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

• రాంబంటు సేవలో తరించిన భక్తజనం

నెల్లూరు(బృందావనం) : హనుమజ్జయంతిని పురస్కరించుకుని సంతపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఐదురోజుల ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆంజనేయ స్వామి గంధర్వ వాహనంపై భక్తులను కటాక్షించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా నాళం కిరణ్‌కుమార్ దంపతులు వ్యవహరించారు. ఈఓ పి.రఘురామయ్య పాల్గొన్నారు.

• నవాబుపేట మైపాడుగేట్ వద్ద ఉన్న సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి సుప్రభాతం, అభిషేకాలు, మూలవర్లకు పూలంగి సేవ, ఆకుపూజ, సిందూర, మల్లెల పూజలు, పల్లకీసేవలు విశేషంగా నిర్వహించారు. అర్చకుడు ఎస్.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఉభయకర్తగా మద్దూరు సుబ్బారావు దంపతులు వ్యవహరించారు. ఈఓ బి.మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు.

• జెండావీధి బొందిలివీధిలోని హనుమాన్ మందిరంలో శ్రీహనుమాన్ మందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామివారికి ఆకుపూజ, సిందూర పూజ, అర్చనలు నిర్వహించారు. మందిర ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.తరుణ్‌సింగ్, నర్మదబాయి, శ్రీనుసింగ్, భగవాన్‌సింగ్, కృష్ణసింగ్, బస్సీనాథ్‌సింగ్, ఎ.నాగేంద్రసింగ్, శ్రీనివాస్‌సింగ్, వాసుదేవ్‌సింగ్ పాల్గొన్నారు.

• పాతపెద్దాస్పత్రి వద్ద ఉన్న అభయసంజీవరాయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. ఎన్ఎన్ కుమార్‌సింగ్– టీనా దంపతులు పర్యవేక్షించారు.

• మూలాపేట ఇసనాకుల కామయ్యవీధిలోని పాండురంగస్వామి దేవస్థానంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో హోమాలు, పూజలు నిర్వహించారు. నిర్వాహకుడు ఇసనాకుల మల్లికార్జున్ పాల్గొన్నారు.

• వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, రుద్ర హోమాలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. ఉభయకర్తలుగా మునిరత్నంనాయుడు దంపతులు వ్యవహరించారు.

• పప్పులవీధిలోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి లక్ష ఆకుపూజ, స్నపన తిరుమంజనం, రాత్రి నగరోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఐతా రామచంద్రరావు, పెనుగొండ సుబ్బారావు, పసుమర్తి సురేష్‌కుమార్, డాక్టర్ బీవీఎస్ రవిశంకర్, డాక్టర్ బీసీ బాలాజీ వ్యవహరించారు. ఈఓ కె.కామేశ్వరరావు పర్యవేక్షించారు.

• రామ్‌నగర్ శబరి శ్రీరామక్షేత్రంలో ఆంజనేయ స్వామికి లక్ష మల్లెల అర్చన, హోమాలు నిర్వహించారు. రాత్రి పదేళ్లలోపు బాలలకు వెండి డాలర్‌ను అందజేశారు. అనంతరం నగరోత్సవం నయనానందకరంగా జరిగింది.

• ఏసీ స్టేడియం వద్ద సుజాతమ్మ కాలనీలో కృష్ణయోగ మందిరం, అష్టలక్ష్మి మందిరం, శ్రీకార్య సిద్ధి ఆంజనేయస్వామి మందిరం, ఉమాదేవి సమేత నాగేశ్వరస్వామి ఆలయాల్లో పంచామృతాభిషేకం, లక్ష నాగవల్లి దళార్చన నిర్వహించారు. రాత్రి పల్లకిసేవ వేడుకగా జరిగింది.

• ఫత్తేఖాన్‌పేట సీతారామ మందిరంలో భారీ పంచముఖ ఆంజనేయస్వామికి సుమారు 200 లీటర్ల పాలతో అభిషేకం, లక్ష తమలపాకులతో అర్చన, పుష్పాభిషేకం జరిగింది. ఉభయకర్తలుగా మల్లిశెట్టి రత్నకుమార్, మల్లిశెట్టి సోదరులు వ్యవహరించారు.

• బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అర్చకుడు బృందావనం శ్రీనివాసదీక్షితులుచే పంచామృతాభిషేకాలు, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, లక్ష తమలపాకులతో ఆకుపూజ, సిందూరార్చన, సహస్ర నామార్చన సామూహికంగా నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి ఒంటెపై స్వామివారి నగరోత్సవం కనుల పండువగా జరిగింది. ఉభయకర్తలుగా వంగపాటి రమణయ్య– సరస్వతమ్మ దంపతులు వ్యవహరించారు. సీతారామస్వామి మందిర కమిటీ, వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపం కమిటీ నిర్వాహకులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కొప్పరపు శివప్రసాద్, అమరా మోహన్‌రావు, ఎస్.హనుమంతరావు, అప్పలసత్యం పర్యవేక్షించారు.

• నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని పొట్టేపాళెంలో ఉన్న కోదండరాముని ఆలయంలో ప్రసన్నాంజనేయస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి అభిషేకాలు, అరటిపళ్లతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

• రూరల్ మండలం నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వీరాంజనేయ స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా రుద్రకోట శ్రీనివాసులు కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ గోపి, అర్చకులు మాధవగిరి భాస్కరాచార్యులు, అప్పలాచార్యులు, రాఘవాచార్యులు, కృష్ణమాచార్యులు, మురళీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లో స్వామివారి నగరోత్సవం



వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో..



కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో..



రామ్‌నగర్ శబరి శ్రీరామక్షేత్రంలో..



జెండావీధి హనుమాన్ మందిర్‌లో..



గ్రామోత్సవంలో ప్రసన్నాంజనేయస్వామి



ఫత్తేఖాన్‌పేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో..



మైపాడుగేట్ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో..



మూలాపేట ఆంజనేయస్వామి ఆలయంలో..

క్లుప్తంగా

హనుమాన్ వెండి డాలర్ల పంపిణీ

నెల్లూరు సిటీ: నగరంలోని మైపాడుగేటు సెంటర్‌లో ఉన్న సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో మైపాడుగేటు గణపతి కార్తీక దీపోత్సవ మిత్ర మండలి ఆధ్వర్యంలో 150 హనుమాన్ వెండి డాలర్లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మదన్, ప్రవీణ్, సుమన్, అశోక్, సునీల్, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి పరామర్శ



కుసుమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పర్వతరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ నాయకుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు మాతృమూర్తి కుసుమాంబ ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పార్టీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. నెల్లూరు నవాబుపేటలోని పబ్బిశెట్టి గృహానికి పర్వతరెడ్డి గురువారం వెళ్లి కుసుమాంబ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

సతీష్‌రెడ్డికి కళాత్మక శుభాకాంక్షలు



నెల్లూరు(బృందావనం): రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు, నెల్లూరీయుడు డాక్టర్ జి.సతీష్ రెడ్డికి చిత్రకారుడు అమీర్ జాన్ కళాత్మకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నెమలి పించంపై సతీష్‌రెడ్డి చిత్రాన్ని తీర్చిదిద్ది పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

పుస్తకావిష్కరణ



నెల్లూరు (వీఆర్సీసెంటర్) : 'పాలస్తీనా ముఖచిత్రం' పేరుతో రైతుకూలీ సంఘం ప్రచురించిన పుస్తకాన్ని గాంధీ బొమ్మ వద్ద సండేమార్కెట్ యూనియన్ మీటింగ్‌హాల్లో గురువారం ఆవిష్కరించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత, ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర నాయకుడు మాల్యాద్రి హాజరై, మాట్లాడారు. అమెరికా సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతోనే గాజా నగరంపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని ఆరోపించారు. గాజాపై దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఖాదర్‌బాషా, లక్ష్మీరెడ్డి, హఫీజుద్దీన్, సుబ్బరాయుడు, రమణయ్య, కొండమ్మ, యానాదయ్య, శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ నూతన కమిటీ ఎన్నిక



నెల్లూరు (వీఆర్సీసెంటర్): నగరంలోని డైకస్ రోడ్డులో ఆటో స్టాండ్ సీఐటీయూ నూతన కమిటీ ఎన్నికను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, పెంచలనరసయ్య మాట్లాడుతూ, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసేది సీఐటీయూ అని తెలిపారు. తొమ్మిది మందితో ఏర్పాటు చేసిన నూతన కమిటీలో గౌరవాధ్యక్షుడిగా ఖలీల్, అధ్యక్ష, కార్యదర్శులుగా సిద్దయ్య, షాన్‌వాజ్‌లు ఉన్నారు. సుధాకర్, సంపత్, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యవేదిక ప్యానల్‌కు కాంగ్రెస్ లీగల్‌సెల్ మద్దతు



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నెల్లూరు బార్ అసోసియేషన్‌లో జూన్ 20వ తేదీన జరుగనున్న ఎన్నికల్లో న్యాయవాదుల ఐక్యవేదిక ప్యానల్‌కు కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ మద్దతు ఇస్తోందని ఆ పార్టీ లీగల్‌సెల్ జనరల్ సెక్రటరీ సుధీర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన న్యాయవాదుల ఐక్యవేదిక ప్యానల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను కలిసి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. అడ్వొకేట్లు సంజయ్, ప్రతాప్, సుస్మిత, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇందిరా భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సమక్షంలో పలువురు టీడీపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పడుగుపాడుకు చెందిన కిరణ్‌కుమార్ నేతృత్వంలో గురువారం 20 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ట్యాక్స్ రివిజన్ సర్వేకు ప్రాధాన్యం



22వ డివిజన్‌లో పర్యటించి సూచనలు చేస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : నగరంలో ఇంటింటికీ తిరిగి నిర్వహించే టాక్స్ రివిజన్ సర్వేకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని కమిషనర్ నందన్ రెవెన్యూ అధికారులు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 22, 23వ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అడ్మిన్ కార్యదర్శి, సచివాలయ ఇతర కార్యదర్శులను సమన్వయం చేసుకుని ఇంటింటి ట్యాక్స్ రివిజన్ సర్వే నిర్వహించాలన్నారు. అనంతరం బీవీనగర్ పరిసర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి కేఎన్నార్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక చిన్నపిల్లల ప్రైవేట్ స్కూల్‌కు రెసిడెన్షియల్ అసెస్మెంట్ డిమాండ్ మంజూరు చేసిన కారణంగా సంబంధిత సచివాలయ అడ్మిన్ కార్యదర్శికి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయమని ఆదేశించారు. మైపాడు గేట్ ప్రాంతంలో నూతనంగా జరుగుతున్న కాలువల నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. పనులు నాణ్యతగా ఉండేలా జాగ్రత్తలు వహించాలన్నారు. డివిజన్ పరిధిలో ఎలాంటి రోడ్డు ఆక్రమణలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. 37వ డివిజన్ పరిధిలో ఏసీ బస్సు షెల్టర్ల నిర్వహణ, ఉపయోగిస్తున్న ప్రయాణికుల సంఖ్య, పనితీరులను పరిశీలించారు. వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెట్ కాన్ఫరెన్స్‌ను విస్తృతంగా నిర్వహించండి



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది మధ్య సెట్ కాన్ఫరెన్స్ ద్వారా విస్తృతంగా సమావేశాలను నిర్వహించుకోవాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శానిటేషన్ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభాగాల వారీగా అందజేసిన వాకీటాకీ సెట్లలో నిర్దేశించిన చానళ్లలో వివిధ విభాగాల వారు కాన్ఫరెన్స్‌లు నిర్వహించుకునేందుకు అనువుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నాయని తెలియజేశారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిటీ ప్లానర్ హిమబిందు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ అంకిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంధర్‌రెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపినాథ్, గోపాల్ రెడ్డి, ఆరి ప్రసాద్, సుబ్బరాజు, గఫార్, రాజా, రమేష్, ఖలీల్ బేగ్ పాల్గొన్నారు.

'అపోలో'లో కాస్మొటిక్ క్లినిక్ ప్రారంభం



మాట్లాడుతున్న అపోలో ఆస్పత్రి డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): మెట్రో నగరాలకే పరిమితమైన కాస్మొటిక్ సర్జరీ సేవలను నెల్లూరులోని అపోలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో అందుబాటులోకి వచ్చినట్లు ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. నగరంలోని అపోలో ఆస్పత్రిలో కాస్మొటిక్ క్లినిక్‌ను ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసరావు నేతృత్వంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, డాక్టర్ శ్రీనివాసరావులు మాట్లాడుతూ వయస్సు పెరుగుదలతో ముఖంపై వచ్చే మార్పులను ఒకప్పుడు సెలబ్రిటీలు మాత్రమే కాస్మొటిక్ సర్జరీతో సరి చేయించుకునే వారన్నారు. ఇప్పుడు అపోలోలో అందరికీ అందుబాటులోకి తక్కువ ఖర్చుతో కాస్మొటిక్ సేవలను తీసుకుని వచ్చామన్నారు. ప్రమాదాల వల్ల ముఖంపై ఏర్పడిన గాయాల మచ్చలు, ఇతర సమస్యలను మాత్రమే కాకుండా ముఖంపై అవయవాల చక్కటి కూర్పుకోసం, అందంగా ఉండేందుకు కాస్మొటిక్ సర్జరీలు ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్ కల్లూరుపల్లి అరుంధతీయవాడలో రూ.41 లక్షలతో సీసీరోడ్డు పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 నెలల కాలంలో 24వ డివిజన్‌లో రూ.5.60 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ అరవ శాంతి పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డీఎస్సార్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్ర, శనివారాల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఈఈ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లేక్‌వ్యూ కాలనీ, ప్రగతినగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రకాష్‌రాజ్ దిష్టిబొమ్మ దహనం

నెల్లూరురూరల్: నగరంలోని గుప్తా పార్కు సెంటర్‌లో సినీనటుడు ప్రకాష్‌రాజ్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు గురువారం దహనం చేశారు. ప్రకాష్‌రాజ్ సోషల్ మీడియా వేదికగా పాకిస్తాన్‌కు సంబంధించిన సినిమాలను మనదేశంలో బ్యాన్ విధించడం సరికాదని చెప్పడాన్ని నిరసిస్తూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. హేమంత్, పెంచలయ్య, బాలాజీ, లక్ష్మి, మధు, కృష్ణ, ప్రసాద్, తులసి పాల్గొన్నారు.

పార్కుల్లో ఉచిత యోగా శిబిరాలు

నెల్లూరు(బారకాసు): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర–2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ నందన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో నగరపాలక సంస్థ పరిధిలోని పలు పార్కుల్లో ఉచిత యోగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు, పీపుల్స్ పార్కు, ఎన్టీఆర్ పార్కు(అనిల్ గార్డెన్స్), ఎంఎస్సార్ పార్కు, నుడా పార్కు(అన్నమయ్య సర్కిల్), పప్పులవీధి పార్కు, ఏసీనగర్ ఎంఎస్ఎం పార్కు, ఆదిత్య నగర్ పార్కు, మహబూబ్‌ఖాన్ పార్కు, స్వాతంత్ర పార్కు, బ్యాంకు కాలనీ పార్కులలో ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 7 వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు యోగా గురువుల సహకారంతో ఉచిత శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేరస్తులపై ఉక్కుపాదం

• గస్తీని ముమ్మరం చేయాలి
• నవాబుపేట పోలీసుస్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



ఆర్ఎస్సైలు నాగరాజు, నజీర్‌బాషాలతో మాట్లాడుతున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): ప్రజాజీవనం, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న రౌడీషీటర్లు, పాతనేరస్తులపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన నవాబుపేట పోలీసుస్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, సస్పెక్ట్, కేడీ, డీసీలు ఎంతమంది ఉన్నారు? ఏం చేస్తున్నారు? వారిలో యాక్టివ్ ఎంతమంది అనే వివరాలను ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, యాక్టివ్ రౌడీషీటర్లను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కేసుల పెండెన్సీకి గల కారణాలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌తో పాటుగా వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బహిరంగ మద్య సేవనంపై దాడులు పెంచాలన్నారు. దొంగతనాల కట్టడికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కేసుల్లో విచారణ వేగవంతం చేసి నిందితులను గుర్తించి చోరీ సొత్తును రికవరీ చేయాలన్నారు. మత్తు, మదక ద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. కేసుల్లో పట్టుబడి శిథిలమైన వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలనన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిఘా వ్యవస్థను పటిష్టం చేసి నేరాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల తనిఖీ

నార్త్, సౌత్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లను ఎస్పీ కృష్ణకాంత్ ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణకు సూచించారు. రోడ్డు ప్రమాదాల కట్టడి, ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు? తదితరాలను ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బంది నిర్దేశిత ప్రాంతాల్లో ఉంటూ ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లకుండా చూడాలన్నారు.

చలం సాహిత్యం ఎనలేనిది



చలం సాహిత్యంపై విశ్లేషణ చేస్తున్న రచయితలు

నెల్లూరు (టౌన్): గుడిపాటి వెంకటాచలం రచనలు, సాహిత్యం ఎనలేనిదని పెన్నా రచయితల సంఘం అధ్యక్షుడు సుభద్రాదేవి అన్నారు. స్థానిక వెంకటేశ్వర విద్యాలయంలో పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో చలం సాహిత్యం ఒక విశ్లేషణ అనే అంశంపై గురువారం పలువురు ప్రసంగించారు. గుడిపాటి వెంకటాచలం రచనలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తాయన్నారు. రచయితలు శివకుమార్, పెరుటు రామకృష్ణ, బృందావనరావు, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

మొఘల్ జ్యువెలర్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చిన్నబజార్ కాకర్లవారి వీధిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్సూర్‌కు చెందిన మొఘల్ జ్యువెలర్స్‌ను పార్టీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్సూర్‌ను చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

న్యాయ విచారణ జరిపించాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆదివాసీలను నారాయణపూర్‌లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో క్రూరంగా హత్యచేసిన ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని పౌరహక్కుల సంఘం జిల్లా నాయకుడు ఎల్లంకి వెంకటేశ్వర్లు, లాయర్స్ యూనియన్ నాయకులు బ్రహ్మం డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు వీఆర్సీసెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. చర్చలకు సిద్ధమన్న మావోయిస్టు పార్టీతో కేంద్రం చర్చలు జరపకుండా బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు.